నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | HYDERABAD



కీసరగుట్టలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరైన మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి


వేసవి కాలంలో ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలంటూ.. సోమవారం ఖైరతాబాద్ లోని జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి - మల్కాజిగిరి, ఫిబ్రవరి 24

# మునగాల్సిందేనా..?

కాలనీలు, లోతట్టు ప్రాంతాలకు వరద ముంపు తప్పదా?

ఫిబ్రవరి ముగింపునకు వచ్చినా ప్రారంభం కానీ పూడికతీత పనులు

డిసెంబర్‌లో టెండర్లు, గత నెలలో ప్రారంభం కావాల్సిన డీసిల్టింగ్

టెండర్ల దశలోనే మీన మేషాలు లెక్కిస్తున్న ఇంజినీరింగ్ విభాగం

జీహెచ్ఎంసీ పనులంటేనే దూరంగా ఉంటున్న కాంట్రాక్టర్లు

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి అనుమానమే



సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ ) :రాబోయే వర్షాకాలంలో వరద ముంపు తప్పదా? కాలనీలు, బస్తీలు వరద నీటిలో మునగాల్సిందేనా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. ప్రతి ఏటా జనవరి నుంచే ప్రారంభం అయ్యే డీసిల్టింగ్ (పూడికతీత) పనులు ఈ సంవత్సరం ఫిబ్రవరి నెల ముగుస్తున్నా.. కనీసం నాలాల పూడికతీత పనులు మొదలు కాలేదు. ఒకటి, రెండు చోట్ల తాజాగా టెండర్లు పిలిచిన అధికారులు దాదాపు వందలాది చోట్ల పనులకు టెండర్లు పిలవకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. ప్రతి ఏడాది దాదాపు రూ.60 కోట్ల మేర నాలా పూడికతీత పనులకు టెండర్లు పిలిచి వర్షాకాలం తొలకరి జల్లులు కురిసే నాటికల్లా పూడికతీత పనులను పూర్తి చేసి వరద నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలి. కానీ ఘనత వహించిన జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ నిర్వహణ విభాగం మీనమేషాలు లెక్కిస్తున్నది. అసలే ఆర్థిక కష్టాలు...ఆపై రూ.1400కోట్ల బకాయిలు చెల్లించాలంటూ కాంట్రాక్టర్ల హెచ్చరికలు...జీహెచ్ఎంసీ పనులంటేనే హడలిపోతున్న కాంట్రాక్టర్లతో ముందస్తు ప్లాన్‌తో వెళ్లాల్సిన ఇంజినీరింగ్ విభాగం నాలా పూడికతీత పనులను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. డిసెంబర్‌లో పనులకు టెండర్లు పిలిచి జనవరిలో ప్రారంభించి మే నెలాఖరు కల్లా పూర్తి చేయాల్సిన చోట ...నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దీనికి తోడు ఎస్ఎన్‌డీపీ మొదటి దశను ఇంకా పూర్తి చేయలేకపోవడం ..పూడికతీత పనులు చేపట్టకపోవడం పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంత ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

## కేవలం 81 శాతం..

జీహెచ్ఎంసీ పరిధిలో వరద నీటి కాలువల పొడవు 1302 కిలోమీటర్ల మేర ఉండగా...390 కిలోమీటర్లు మేజర్ నాలా, మైనర్ డ్రైయిన్స్ 912 కిలోమీటర్లు మేర ఉన్నాయి. ప్రతి ఏటా మాదిరిగానే వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు పునరుద్ధరణ, మరమ్మతు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ఏటా రూ. 50 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. అయితే పనులను సకాలంలో జరపకుండా వరద నీటి ముంపునకు అధికారులు కారణమవుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభం నాటికల్లా పూర్తి కావాల్సిన పనులను 80శాతమే పూర్తి చేసి తొలకరి జల్లు నాటికి పూడికతీతను వర్షార్పణం చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఇందులో భాగంగానే 2024 సంవత్సరంలో 3.12 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను తీసి 81 శాతం పనులతో ముగించారు. రికార్డుల్లో మాత్రం ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీస్తున్నట్లు లెక్కలు చూపిస్తూ పనుల పారదర్శకతకు పాతర వేస్తుండడం గమనార్హం.


పోచారం వద్ద ఉన్న చెరువులో సందడి చేస్తున్న వలస పక్షులు

# హుడా కాంప్లెక్స్ స్థలంపై పెద్దల కన్ను?

ఇటీవలే వ్యాపార సముదాయాన్ని కూల్చివేసిన హెచ్ఎండీఏ

కూల్చివేత మరుసటిరోజే ఆ స్థలాన్ని పరిశీలించిన ఓ వీఐపీ



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కొత్తపేట హుడా కాంప్లెక్స్... అత్యంత రద్దీ, వ్యాపారపరంగా అత్యంత డిమాండ్ ఉన్న కూడలికి ఆనుకున్న ప్రదేశం. అలాంటి చోట హెచ్ఎండీఏకు ఒకటీ, అరా కాదు... ఏకంగా 4,311 చదరపు అడుగుల స్థలం ఉంది. అక్కడున్న పాత వ్యాపార సముదాయ భవనాన్ని ఇటీవల హెచ్ఎండీఏ కూల్చివేసింది. దశాబ్దాలుగా దుకాణాల్లో ఉండే వారిని కోర్టు ఆదేశానుసారం ఖాళీ చేయించి కూల్చివేత చేపట్టింది. మరి... ఇంత కీలకమైన స్థలాన్ని హెచ్ఎండీఏ ఏవిధంగా వినియోగించుకోనుంది?! అనే ఆసక్తి నెలకొని ఉన్న సమయంలోనే ఓ వీఐపీ ఆ స్థలాన్ని పరిశీలించడం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

## 32 దుకాణాలు..

కొత్తపేటలోని హుడా కాంప్లెక్స్ అంటే బహుశా నగరంలో తెలియనివారు ఉండరు. 1981 నుంచి ఎగువనున్న రెండు అంతస్తులను రంగారెడ్డి జిల్లా కోర్టుకు లీజు ప్రాతిపదికన ఇచ్చారు. జిల్లా కోర్టుతో పాటు అనుబంధంగా అనేక కోర్టులు ఉండటంతో దిగువన ఉన్న దుకాణాలకు భారీఎత్తున డిమాండు ఉండేది. అలా 32 దుకాణాలను కూడా హుడా అద్దె ప్రాతిపదికన ఇచ్చింది. 2008లో ఇప్పుడు కొనసాగుతున్న రంగారెడ్డి కోర్టు కొత్త భవనం సిద్ధమవ్వడంతో జిల్లా, అనుబంధ కోర్టులన్నీ అక్కడికి తరలిపోయాయి. అప్పటి నుంచి పైనున్న రెండు అంతస్తులు ఖాళీగానే ఉన్నాయి.

## అప్పట్లోనే బడా నేత కన్ను...

రంగారెడ్డి జిల్లా కోర్టు కొత్త భవనానికి తరలిపోయిన తర్వాత ఆ స్థలంపై ఉమ్మడి రాష్ట్రంలో కీలకంగా వ్యవహరించిన సినీ, పారిశ్రామిక, రాజకీయ రంగ ప్రముఖుడు ఒకరి కన్ను దానిపై పడింది.ఏదో ఒక పద్ధతిలో దానిని దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అప్పటి హుడా అధికారులు కిరాయికి ఉన్న 32 దుకాణదారులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించగా.. వారంతా ఒక యూనియన్‌గా ఏర్పడి కోర్టును ఆశ్రయించారు. కాగా ఆ వ్యాపార సముదాయ భవనం శిథిలావస్థకు చేరుకుందని, కూల్చకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముందని హెచ్ఎండీఏ అధికారులు కోర్టు దృష్టికి తీసుకుపోయారు. భద్రతా కారణాల దృష్ట్యా న్యాయస్థానం కూల్చివేతకు అనుమతినిచ్చింది. ఈ క్రమంలో అధికారులు ఈ నెల 19న ఆ భవన సముదాయాన్ని కూల్చివేశారు.

## సదరు వీఐపీ పరిశీలనతో...

హుడా కాంప్లెక్స్ భవన సముదాయాన్ని కూల్చివేసిన మరుసటి రోజే సుమారు ఎకరం వరకు ఉన్న ఆ స్థలాన్ని ఒక రాజకీయ వీఐపీ ఒకరు పరిశీలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉన్న వ్యక్తి కావడంతో ఈ స్థలంపై సదరు వీఐపీ కన్నేసినట్లుగా ఖాళీ చేసిన దుకాణదారులతో పాటు స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది.

## విచారణకు ఆదేశాలు?

మేడ్చల్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): దేవాదాయ భూముల్లో ఆక్రమణలపై విచారణ చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. మేడ్చల్ జిల్లాలో దేవాదాయ భూములు 2,304 ఎకరాలు రికార్డులలో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. భూములు అనేకం ఆక్రమణలకు గురువుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు దేవాదాయ భూముల్లో వెలిసిన ఆక్రమణల లెక్క తేల్చి.. ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. దీంతో ఆక్రమణలపై విచారణ చేసేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

## చుక్క నీరు రావడం లేదు...

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గాయత్రీ నగర్ లో 25 రోజులుగా చుక్క మంచినీరు రావడం లేదంటూ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లో ప్రెషర్ కారణంగా గాయత్రీనగర్ మంచి నీటి సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

## కార్డియాలజిస్ట్ సూర్యప్రకాశ్‌రావుకు గ్లోబల్ అవార్డు

అంబర్‌పేట, ఫిబ్రవరి 24: కేర్ హాస్పిటల్ సీనియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాశ్‌రావు టాప్ మోస్ట్ హెల్త్ కేర్ లీడర్స్ గ్లోబల్ అవార్డును అందుకున్నారు.



ఈ సందర్భంగా సూర్యప్రకాశ్‌రావు డీడీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కాంగ్రెస్ అండ్ అవార్డ్స్–2025 తొమ్మిదో ఎడిషన్ వారు తనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు వివరించారు. కొన్ని దశాబ్దాలుగా దాదాపు పదివేలకు పైగా గుండెకు సంబంధించిన ఆపరేషన్లు విజయవంతంగా చేసినందుకు తనకు ఈ అవార్డు ముంబైలో అందజేసినట్లు తెలిపారు.

## ట్రాన్స్‌పోర్ట్ ఫండ్

ఉమ్టా ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్టు పన్నులు వసూలు చేసే యోచన

సిటీబ్యూరో: హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ ఫండ్‌ను డెవలప్ చేయనున్నారు. ఉమ్టా ఆధ్వర్యంలో ఈ నిధిని సమీకరించనున్నారు. కాగా, ఉమ్టా ప్రతిపాదనల ప్రకారం నగరంలో కొత్త పన్ను విధానం ఎలా ఉంటుందనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నగరంలో నిత్యం 3–4వేల వాహనాలు కొత్తగా విక్రయిస్తున్నారు. వీటికి సంబంధించిన ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఫీజు వస్తోంది. ఈ చార్జీల్లో కొంత మొత్తాన్ని యూటీఎఫ్‌కు కేటాయించాలనే ప్రతిపాదనలు చేస్తారా? లేక హెచ్ఎండీఏ పరిధిలో 1.25శాతం వసూలు చేసే బిల్డింగ్ డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో వసూలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. దీని ప్రకారం నగరంలో కొత్తగా పన్ను వసూలు చేసి, హెచ్ఎండీఏ పరిధిలో రవాణా సదుపాయాలపై దృష్టిపెడతారా? అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇదే గనుక జరిగితే నగరంలో ట్రాన్స్‌పోర్టు ప్రణాళికలను ప్రభుత్వ ప్రమేయం లేకుండానే నిధులను ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంటుంది.



## హామీలు నెరవేర్చడంలో విఫలం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 24 : హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాలానగర్ డివిజన్ చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మధు ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువ నేతలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని, పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు.

## బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై దిద్దుబాటు చర్యలు

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో జనన, మరణ ధ్రువ పత్రాల జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం, కొన్ని చోట్ల తప్పుల తడకగా సర్టిఫికెట్ల జారీ అవుతున్న నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో అత్యంత కీలకమైన దవాఖానల నిర్వాహకులు, సిబ్బందిపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం నెలకొందని, కరెక్షన్ ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొంటూ 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ వైద్యాధికారులు, ఉన్నతాధికారులు కలిసి ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల ఆసుపత్రుల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లలో ఎలాంటి తప్పులు దొర్లవద్దని, ఒకటి రెండు సార్లు సరి చూశాకే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని దిశానిర్దేశం చేయనున్నారు.

# రూ.122 కోట్లు వసూలే లక్ష్యం

పెండింగ్ బిల్లుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

మూడు విద్యుత్ జోన్లలో రూ.122 కోట్ల బకాయిలు

ఏఈ నుంచి చీఫ్ ఇంజినీర్ వరకు క్షేత్రస్థాయిలోనే..

మార్చిలోపే 80 శాతం వసూళ్లకు యత్నం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో విద్యుత్ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. మూడు సర్కిళ్లలో రూ.122 కోట్లు పెండింగ్ బిల్లులు ఉండడంతో వీటి వసూళ్లపై దక్షిణ డిస్కం దృష్టిపెట్టింది. మార్చినెల నుంచి ఎండలు ముదిరితే విద్యుత్ వినియోగం మరింత పెరిగే పరిస్థితి ఉండడంతో అంతకు ముందే పెండింగ్ బిల్లులు వసూలు చేయడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. వాస్తవానికి ఎప్పటికప్పుడు బిల్లులు జారీ చేసి, రెవెన్యూ కలెక్షన్ చేయాల్సిన ఇంజినీర్లు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి 1 నాటికి గ్రేటర్ సర్కిళ్ల పరిధిలో 62 లక్షలకు పైగా గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు ఉండగా, వీటిలో రంగారెడ్డి జోన్లో 2,84,902 సర్వీసులు, మెట్రో జోన్‌లో 3,94,763 సర్వీసులు, మేడ్చల్ జోన్‌లో 2,24,816 సర్వీసులు విద్యుత్ బిల్లులు బకాయిలు పడ్డాయి. ఈ మేరకు అకౌంట్స్ విభాగం వంద శాతం రెవెన్యూ కలెక్షన్స్ లక్ష్యంగా ప్రతీ నెలా డి(డిస్‌కనెక్షన్) లిస్ట్ తయారు చేసి క్షేత్రస్థాయి ఇంజినీర్లకు అందిస్తోంది. వీరు ఎప్పటికప్పుడు ఆయా వినియోగదారుల వద్దకు వెళ్లి పెండింగ్ బిల్లులు వసూలు చేయాల్సి ఉండగా ఆ పరిస్థితి లేకపోవడంతో భారీగా బకాయిలు పేరుకుపోయాయి.


క్షేత్రస్థాయిలో పెండింగ్ బిల్లులు వసూలు చేస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ సిబ్బంది

## సౌత్ సర్కిల్‌లోనే ఎక్కువ పెండింగ్..


మెట్రో జోన్ నుంచి రూ.72.32 కోట్లు రావాల్సి ఉంది. రంగారెడ్డి జోన్ నుంచి రూ.38.28 కోట్లు, మేడ్చల్ జోన్ నుంచి రూ.12 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. ఒక్క హైదరాబాద్ సౌత్ సర్కిల్ నుంచే రూ.51.06 కోట్లు రావాలి. సర్కిళ్ల వారీగా పెండింగ్ బిల్లులు చూస్తే.. రాజేంద్రనగర్‌లో రూ.22.58 కోట్లు, హైదరాబాద్ సెంట్రల్‌లో రూ. 16.16 కోట్లు, సైబర్‌సిటీలో రూ.7.70 కోట్లు, వికారాబాద్‌లో రూ. 5.45 కోట్లు, సంగారెడ్డిలో రూ. 4.28 కోట్లు, హబ్సిగూడలో రూ. 4.04 కోట్లు, మేడ్చల్‌లో రూ.3.73 కోట్లు, సరూర్‌నగర్‌లో రూ. 2.55కోట్లు, సికింద్రాబాద్‌లో రూ.2.05 కోట్లు ఉన్నాయి. వసూళ్ల కోసం డ్రైవ్ నిర్వహించాలని సంస్థ ఆదేశించినప్పటికీ.. ఇంజినీర్లు పెద్దగా దృష్టిపెట్టడం లేదు. క్షేత్రస్థాయి సిబ్బంది కేవలం మీటర్ రీడింగ్‌కే పరిమితమవుతున్నారు.

## క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు..

విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఎల్‌టీకి సంబంధించి మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో కలిసి రూ.122 కోట్ల బకాయిలు ఉండగా.. వీటి వసూలుకు ఏఈ నుంచి చీఫ్ ఇంజినీర్ వరకు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలలలో విద్యుత్ డిమాండ్ పెరిగి బిల్లులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో ఈ లోపే పెండింగ్ బిల్లుల్లో కనీసం 80 శాతం వసూలు చేయాలని లక్ష్యంగా డ్రైవ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత మూడు నెలలుగా బిల్లులు చెల్లించని వినియోగదారులపై దృష్టిపెట్టారు. వచ్చే నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఈలోపే బకాయిల వసూళ్లపై సీరియస్‌గా దృష్టిపెట్టినట్లు అధికారులు చెప్పారు. వచ్చేనెలలో కూడా ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని తెలుస్తోంది. వినియోగదారులు బకాయిలు చెల్లించి సహకరించాలని వారు కోరారు. బకాయిల వసూళ్లతోపాటు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వెళ్లే ప్రతీయూనిట్‌ను బిల్లింగ్ పరిధిలోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ నెలా నమోదవుతున్న విద్యుత్ డిమాండ్, రికార్డవుతున్న యూనిట్ల లెక్కలు తీస్తూ ఎనర్జీ ఆడిట్ నిర్వహిస్తున్నారు. పెండింగ్ బిల్లుల వసూళ్లే లక్ష్యంగా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సిబ్బంది మొత్తం పనిచేస్తున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు.

## పార్కులను అందుబాటులోకి తీసుకురావాలి..

లేదంటే గేట్ల తాళాలు పగలకొడతాం: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: పదిహేడు నెలల కిందట పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పార్కులను రెండు రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో గేట్ల తాళాలు పగలగొట్టి ప్రజలకు అప్పజెప్పుతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హెచ్చరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి కేబీఆర్ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో సోమవారం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023 నవంబర్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందు నియోజకవర్గంలో 15 కొత్త పార్కులను మంజూరు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనల కారణంగా ప్రారంభోత్సవం వాయిదా పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా.. పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆరు పార్కులను ప్రారంభించకుండా కాంగ్రెస్ నాయకులు అధికారులను అడ్డుకుంటున్నారని తెలిపారు. పార్కులు తన చేతుల మీదుగా ప్రారంభిస్తే తనకు మంచి పేరు వస్తుందని ఇన్‌చార్జి మంత్రితో ప్రారంభించాలని ప్రయత్నాలు చేశారని.. కానీ ఇంతవరకు ఇన్‌చార్జి మంత్రి అపాయింట్‌మెంట్ కూడా ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులకు దొరికినట్లు లేదన్నారు. పేరు ప్రఖ్యాతల కోసం తాను వెంపర్లాడడం లేదని రెండు రోజుల్లో పార్కులను సంబంధిత అధికారులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోకపోతే గేట్ల తాళాలు పగలగొడతానన్నారు. ఆరోగ్యం బాగాలేక కొన్ని రోజులుగా ఇంటి వద్దే ఉండాల్సి వచ్చినప్పటికీ ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు సలహాలు ఇస్తూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానన్నారు. ప్రతిపక్ష నాయకులు తన ఆరోగ్యంపై కూడా తప్పుడు ప్రచారం చేశారని.. తనకు క్యాన్సర్ వచ్చిందని.. తిరిగి నియోజకవర్గానికి రానని.. బై ఎలక్షన్ వస్తుందని ఆశపడ్డారని ఎద్దేవా చేశారు. ప్రజల ఆశీర్వాదంతో తాను సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నానని.. ఇకనుంచి 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

## స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌పై ఫుడ్ సేఫ్టీ చర్యలు

సిటీబ్యూరో: ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు సోమవారం మెహిదీపట్నంలోని స్ట్రీట్ ఫుడ్ జోన్లలో వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. కొన్ని చోట్ల ఈగలు, దుమ్ము ఉన్న పదార్థాలను పారబోశారు. పలువురికి నోటీసులు జారీ చేసినట్లు, శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపామని, నివేదిక వచ్చిన వెంటనే తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.